క్లుప్తంగా

శాకాంబరీ దేవిగా శారదాదేవి



శాకాంబరీ దేవి అలంకరణలో శారదాదేవి

యానాం: పట్టణ పరిధిలో కొలువైన శారదాదేవి అమ్మవారు సోమవారం శాకాంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో విశేషంగా అలంకరించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ హరీష్ మాధుర్ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ మాధుర్ స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, పిచ్చిక శ్యామ్, మాడా మాధవి, రాయుడు సారథి తదితరులు పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ మెరిట్ జాబితా విడుదల

యానాం: ఆర్ట్స్, ఫైన్‌ఆర్ట్స్ కోర్సులైన బీపీఏ డ్యాన్స్, బీఎఫ్‌ఏ–ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి డ్రాఫ్ట్ మెరిట్ జాబితాను సెంటాక్ అధికారులు సోమవారం విడుదల చేశారు. ఫైన్ ఆర్ట్స్‌కు సంబంధించి 60:40 నిష్పత్తిలో ఎంట్రన్స్ టెస్ట్, హయ్యర్ సెకండరీలో వచ్చిన మార్కుల ఆధారంగా జాబితాను రూపొందించినట్లు తెలిపారు. దరఖాస్తు స్టేటస్, అభ్యంతరాలను సెంటాక్ మెయిల్‌కు ఈ నెల 16వ తేదీలోగా పంపాలని కోరారు. ఆర్కిటెక్చర్ ఫైనల్ మెరిట్ జాబితాను సైతం ప్రచురించినట్లు తెలిపారు. అలాగే బీటెక్ లేటరల్ ఎంట్రీ మెరిట్ జాబితాను సెంటాక్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వెల్లడించారు. ఇప్పటికే అభ్యర్థులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారాన్ని అందించినట్లు కోఆర్డినేటర్ అమన్‌శర్మ తెలిపారు.

అందరూ సభ్యత్వం తీసుకోవాలి

యానాం: పట్టణ పరిధిలో యానాం కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ఎన్నికలు త్వరలో జరగనున్న దృష్ట్యా ఎన్నికల్లో భాగస్వామ్యానికి అందరూ సభ్యత్వం తీసుకోవాలని స్థానిక సోషల్ యాక్టివిస్ట్ సబ్బతి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సభ్యత్వం తీసుకోవడానికిగాను సంబంధిత దరఖాస్తులను గ్రామాల్లో అందించాలని ఇప్పటికే కోపరేటివ్ సంస్థను కోరినట్లు తెలిపారు. కోపరేటివ్ ఎన్నికల్లో పాల్గొనడానికి అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్పీ శ్రీధర్‌కు సత్కారం



బదిలీపై వెళుతున్న ఎస్పీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: బదిలీపై వెళుతున్న జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ సేవలను పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకరరావు కొనియాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీఈఓ కమలకుమారి సోమవారం స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాష్, హెచ్ఎం పురుషోత్తంరాజు, పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుల ఎంపిక

ఐ.పోలవరం: మండలంలోని టి.కొత్తపల్లి సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీకి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం నూతన సభ్యులను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో సభ్యులుగా నడింపల్లి సత్యనారాయణరాజు, కుదుళ్ల వీరబాబు, ముమ్మిడివరపు నాగరత్నంలను ఎన్నుకున్నారు. అనంతరం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, మద్దింశెట్టి పురుషోత్తం, లంకలపల్లి జమ్మి, సాగిరాజు సూరిబాబు పాల్గొన్నారు.

హామీ ఇచ్చి ఉసూరుమనిపించవద్దు



నేను ఎంఏ, బీఈడీ చేసి నిరుద్యోగిగా ఉన్నాను. ఇప్పుడు డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నాను. నాలాంటి నిరుద్యోగులెందరో భృతి కోసం ఎదురు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ నాడు అమలుకు నోచుకోక నిరుద్యోగులుగా చాలా నిరాశ పడ్డాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన భృతి హామీనైనా అమలు చేసి మా ఆశలు తీర్చండి. లేదా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాన్నైనా ఇవ్వండి. 2014 మాదిరిగా ఉసూరుమనిపించవద్దు.

– రొక్కాల దేవి, నిరుద్యోగి, దేవగుప్తం, అల్లవరం మండలం

భృతి హామీని అమలు చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాను, జాబ్ క్యాలెండర్ అమలు చేసి నాలాంటి నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి. కూటమి నేతలు హామీ ప్రకారం నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా అభాసుపాలు చేయకండి. నెలా నెలా ఇచ్చే రూ.3 వేల భృతి అందితే చాలా మంది సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగులు తాత్కాలికంగానైనా ఉపశమనం పొందుతారు.

– చిత్రపు జయరాజు, ఎ.వేమవరం, అమలాపురం రూరల్ మండలం

జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించండి



నేను ఎంకామ్ చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తే అందులో ప్రభుత్వ ఉద్యోగాలను అన్వేషించుకుని పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం అవుతాం. అలాగే నిరుద్యోగ భృతిని ఎన్నికల హామీగా కాకుండా ఓ సామాజిక బాధ్యతగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలి. అప్పుడే నిరుద్యోగుల్లో మీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల పట్ల నమ్మకం పెరుగుతుంది.

– మెండు త్రిమూర్తులు, నిరుద్యోగి, మెండువారిపేట, అమలాపురం

భృతి కోసం ఎదురుచూస్తున్నాం



నిరుద్యోగులందరం జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్నాం. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా నిరుద్యోగుల ఊసు ఎత్తడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. గతంలో మాదిరిగా మోసం చేయకుండా ప్రతి ఇంటికీ ఉద్యోగం, ఉద్యోగం రానివారికి భృతి కల్పించాలి.

– ఎస్.రత్నకుమార్, కాట్రేనికోన

నిరుద్యోగ భృతి.. మళ్లీ హుళక్కేనా?

- ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఎన్నికలయ్యాక ఆ ఊసెత్తని వైనం
- హామీ అమలుపై మరోసారి ఆశలు గల్లంతేనన్న చర్చ



అమలాపురం టౌన్: ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం.. లేకుంటే ప్రతి నిరుద్యోగికి భృతి ఇస్తామంటూ ప్రకటనలు.. ఎన్నికలయ్యాక నిరుద్యోగ భృతి ఊసే ఎత్తరు. ఇదీ చంద్రబాబు తీరు.. 2014 ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానన్న హామీని ఇచ్చి తరువాత అటకెక్కించేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ మళ్లీ అదే హామీని తెరపైకి తెచ్చారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకుంటే నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి ఇస్తామంటూ ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక కనీసం ఆ ఊసే ఎత్తకపోవడంతో నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వేలాది మంది నిరుద్యోగుల ఎదురుచూపులు

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం పట్టణం, అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో దాదాపు 63,000కు పైగా కుటుంబాలు, ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో మరో 72,163 కుటుంబాలు నివసిస్తున్నాయి. దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి నెలకొంది. రెండు నియోజకవర్గాల్లోనూ కలిపి దాదాపు 52,000 మందికి పైగా నిరుద్యోగులున్నట్లు అంచనా.. వీరిలో చాలా మంది డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ నిరుద్యోగులుగా మిగిలిపోయారు. మరికొందరు స్థానికంగా చిన్నాచితకా పనులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీపై ఆశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఉద్యోగం రాకుంటే నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అయినా తమను ఆదుకుంటుందని భావించారు.

మళ్లీ అదే రిపీట్ కాబోతుందా?

నిరుద్యోగి భృతి వస్తుందన్న ఆశతో కొందరు నిరుద్యోగులు ప్రభుత్వ కొలువును సాధించేందుకు అప్పోసొప్పో చేసి స్టడీ సర్కిళ్లు, కోచింగ్ సెంటర్లను ఆశ్రయించారు. పేరొందిన సంస్థల్లో గ్రూప్–1, గ్రూప్–2, డీఎస్సీ, కానిస్టేబుల్ తదితర పోస్టుల కోసం శిక్షణ నిమిత్తం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ ఖర్చవుతోంది. ఈ తరహా నిరుద్యోగులు రెండు నియోజకవర్గాల్లోను కలిపి దాదాపు 3,000 మందికి పైగా ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చి నెల దాటినా నిరుద్యోగ భృతి అమలుపై కనీసం విధి విధానాలు, మార్గదర్శకాల జారీపై కసరత్తు కూడా ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో 2014–19 టీడీపీ ప్రభుత్వ రోజులను తలచుకుని ఇప్పటి భృతి హామీపై నిరుద్యోగుల్లో తీవ్ర చర్చోపచర్చలు జరుగుతున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కనీసం నిరుద్యోగ భృతి ఇచ్చే అంశంపై మాటైనా మాట్లాడకపోవడంపై నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన అమలుకు అంతగా సాధ్యం కాని హామీలు ఇచ్చిన వైనాన్ని చర్చించుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శుల నియామకంతో వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన విషయాన్ని నిరుద్యోగులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అసలు భృతి ఎప్పుడిస్తారు, ఇస్తే ఎప్పటి నుంచి ఇస్తారు, విధి విధానాలేమిటి వంటి నిబంధనలైనా ప్రకటిస్తే తమకు నమ్మకం, విశ్వాసం ఉండేవంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ దిశగా ప్రకటనలో చేసి ఆశతో ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు ఓ భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. 2014 హామీ మాదిరిగానే మళ్లీ నిరుద్యోగ భృతి ఎగ్గొట్టాలని చూస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

విధి విధానాలను తక్షణమే ప్రకటించాలి



కూటమి ప్రభుత్వం సాధ్యం కాని హామీలు ఎన్నో ఇచ్చింది. అందులో నెలా నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఒకటి. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2 వేలు భృతి ఇస్తానని చంద్రబాబు నిరుద్యోగులను వంచించారు. ఇప్పుడు మళ్లీ మరో రూ.వెయ్యి పెంచి రూ.3 వేల ఇస్తానని కల్లబొల్లి హామీ ఇచ్చారు. హామీలు ఇచ్చి ఎగ్గొట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు కూడా ఆ హామీని తుంగలో తొక్కేస్తాడేమోనన్న అనుమానం అందరిలోనూ ఉంది. దమ్ము, ధైర్యం ఉంటే నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ విధి విధానాలను తక్షణమే ప్రకటించి వాటి అమలుకు శ్రీకారం చుట్టాలి.

– పినిపే విశ్వరూప్, మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అమలాపురం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. గతంలో మాదిరిగా మోసం చేయకుండా జనరల్ అభ్యర్థులతో పాటు అందరికీ నిరుద్యోగ భృతి ఇస్తే వారి కుటుంబాలకు మేలు చేసినట్లవుతుంది. నిరుద్యోగులకు కనీసం 40 ఏళ్ల వయసు వరకూ ప్రభుత్వం ప్రకటించిన భృతి ఇవ్వాలి.

– ఎస్.శ్రీనివాస్, జి.వేమవరం, తాళ్లరేవు మండలం

నిరుద్యోగులను అన్ని విధాలా ఆదుకోవాలి



రాష్ట్రంలో నిరుద్యోగులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలి. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామని ప్రకటించిన కూటమి నేతలు ఇప్పుడు మాట్లాడటం లేదు. నిరుద్యోగ భృతి కోసం వేలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిరుద్యోగ భృతి అందజేయాలి.

– ఎ.కుమారకృష్ణ, కొమరగిరి, ఐ.పోలవరం మండలం

వారాహి మహోత్సవాలకు భక్తుల విరాళాలు



వారాహి హోమాన్ని జరుపుతున్న అర్చకులు, భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో జరుగుతున్న వారాహి షోడశ రాత్రి పూజా మహోత్సవాల్లో 11వ రోజు సోమవారం హోమంలో పలు రకాల పండ్లు, కూరగాయలు తదితర హోమ ద్రవ్యాలను సమర్పించారు. మహోత్సవాల నిర్వహణకు సోమవారం పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. అయినవిల్లి మండలం మాగం గ్రామానికి చెందిన దివంగత కొమ్మురెడ్డి సుబ్బారావు పేరుతో ఆయన కుటుంబ సభ్యులు రూ.10 వేలు, పి.గన్నవరం మండలం పప్పులవారి పాలేనికి చెందిన పప్పుల ప్రవల్లిక రూ.7 వేలు, బెంగళూరుకు చెందిన మోరం వెంకటరావు, మోరం వెంకట రామప్రసాద్ రూ.6 వేలు, అమలాపురానికి చెందిన కొమానపల్లి సరళ రూ.6 వేలు, అన్నంనీడి జానకిరామయ్య, మాకిరెడ్డి వెంకట నాగసత్యపూర్ణిమ చెరో రూ.5 వేలు విరాళంగా అందజేశారు. గౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, డాక్టర్ గుత్తం రాజా, న్యూరో సర్జన్ డాక్టర్ లింగోలు చందు, నల్లా శ్రీధర్, అక్షయ పాత్ర ప్రతినిధులు నాగ కనకదుర్గ, తూము దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికార చేపల మార్కెట్‌పై చర్యలు

- ఖాళీ చేయించిన మున్సిపల్ కమిషనర్
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఇంపాక్ట్



చేపల మార్కెట్‌ను తొలగించడంతో ఖాళీగా బైపాస్ రోడ్డు

అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన– ఎర్ర వంతెన మధ్య బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన అనధికార చేపల మార్కెట్‌పై మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ సోమవారం ఉదయం చర్యలు చేపట్టారు. 'చేపల మార్కెట్ తరలించండి' శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు కమిషనర్ మనోహర్ స్పందించి ఈ చర్యలు చేపట్టారు. కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది అక్కడ చేపల మార్కెట్ తొలగించి బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. ఇక నుంచి అక్కడ అనధికార చేపల మార్కెట్ ఏర్పాటు చేయవద్దని, ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చేపల దుకాణదారులను మున్సిపల్ సిబ్బంది హెచ్చరించారు. చేపల మార్కెట్ వల్ల పక్కనే ఉన్న కాలువ కలుషితమవ్వడంతో పాటు పరిసర గృహాల నివాసితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ చెప్పారు. కమిషనర్ తీసుకున్న చర్యలపై ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రూ.10 వేల ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న ప్రజాసేవ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కాట్రేనికోన: మండలంలోని గచ్చకాయలపోరకు చెందిన మల్లాడి ధర్మారావు కుమార్తె అనారోగ్యంతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రజా సేవ చారిటబుల్ ట్రస్టు సభ్యులు సోమవారం కాకినాడ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలికి రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారు. నిరుపేదలు, అభాగ్యులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలి



మాస్టర్ ట్రైనర్లతో సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్: ఈ నెల 18 నుంచి నిర్వహించే టీచ్ టూల్ ట్రైనింగ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం టీచ్ టూల్ మాస్టర్ ట్రైనర్లకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కమలకుమారి మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్స్ అబ్జర్వర్లకు మంచి కంటెంట్‌ను అందజేయాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో తొమ్మిది రోజుల శిక్షణను నిర్వహించాలని సూచించారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 415 మంది అబ్జర్వర్లకు తొమ్మిది రోజుల శిక్షణ నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎల్ఎఫ్ఈ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్స్ పి.వివేక్, ఎం.పూజ, ఎంఈవో–2 ఎస్.దుర్గాదేవి పాల్గొన్నారు.

ఘనంగా కామరాజ్‌నాడార్ జయంతి



కామరాజ్ నాడార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పెరుంతలైవార్ కామరాజ్ నాడార్ జయంతిని సోమవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్డులో ఆయన కాంస్య విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి సేవ చేసిన నాడార్ చిరస్మరణీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ నిధులతో మౌలిక సదుపాయాలు



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

సాక్షి, అమలాపురం: ఎంపీ ల్యాడ్స్ నిధులను జిల్లాలో మౌలిక సదుపాయల కల్పనకు వినియోగించాలనే లక్ష్యంగా పెట్టుకున్నానని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సోమవారం ఆయన చర్చించారు. తాను పార్లమెంట్ సమావేశాలకు వెళ్లి తిరిగి వచ్చే సమయానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కె.చంటిబాబు, ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, ఏఈఈ చిన్నం రాజు, కొండలరావు, గంగాధర్‌లు పాల్గొన్నారు.

జీపీఎస్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

అమలాపురం టౌన్: జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన గెజిట్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పళ్లంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్టీయూ ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. అమలాపురంలో సోమవారం సాయంత్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ మేరకు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీపీఎస్ కంటే మెరుగైన విధానం తెస్తామని చెప్పి ఇప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా దాని అమలుకు గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అని వారు విరుచుకుపడ్డారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయడం తప్ప మరే ప్రత్యామ్నాయ మార్గాలను ఎస్టీయూ అంగీకరించబోదని వారు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఈ విషయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

విచక్షణ రహితంగా సాగు నీరు వాడొద్దు



పుల్లేటికుర్రులో రైతులకు శిక్షణ ఇస్తున్న జిల్లా అధికారి ఎలియాజర్

అంబాజీపేట: విచక్షణ రహితంగా సాగు నీరు వాడకం వల్ల పంటలపై తీవ్ర ప్రభావం పడి దిగుబడులు తగ్గుతున్నాయని ఉమ్మడి జిల్లాల ప్రకృతి వ్యవసాయ అధికారి జె.ఎలియాజర్ అన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం, జర్మనీ సంస్థ, వలమ్ అగ్రి ఆధ్వర్యంలో వక్కలంక, కముజువారిలంక, ఇరుసుమండ, కె.పెదపూడి, ముక్కామల, పుల్లేటికుర్రు గ్రామాల్లో కార్బన్ ఉద్గారాల నియంత్రణపై సోమవారం రైతులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎలియాజర్ మాట్లాడుతూ అధికంగా సాగు నీరు వినియోగిస్తే భూమి యొక్క భౌతిక, రసాయన, జీవ ధర్మాలు మారిపోయి పంటలు పండించడానికి వీలు కాకుండా తయారవుతున్నాయన్నారు. సాగు ఎంతవరకు ఉపయోగమో అంతవరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. రసాయన ఎరువులకు బదులుగా ఘన, ద్రవ జీవామృతాలను వినియోగించాలన్నారు. ప్రతి రైతు పెరటి తోటలు పెంచడం వల్ల భూమి సారం పెరగడంతో పాటు అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రతినిధులు ఉదయ్, ప్రసంగి, వరి పరిశోధన కేంద్రం ప్రతినిధి అఖిల్‌యాదవ్, అడిషినల్ డీపీఎం సత్యనారాయణ, ఎస్ఎఫ్ఏ రాధిక పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతుల పంపిణీ

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని తిర్నాతి సూర్యనారాయణమూర్తి జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది. అమెరికాలోని ప్రవాస భారతీయులు, తిర్నాతి వంశీయులకు చెందిన తిర్మాతి శ్రీహిత్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఓరియేంటేషన్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పవన్‌కుమార్, ద్వితీయ బహుమతిని సూర్యప్రకాష్ సాధించారు. గెలుపొందిన విజేతలకు నగదుతో పాటు, వెండి పతకాలను అందజేశారు. ఈసందర్భంగా అమెరికా ప్రతినిధులైన శ్రీహిత్, స్విప్ గార్డినర్ తదితరులు విద్యార్థులకు చక్కని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు బి.శివరామ కుమార్‌ను ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తిర్నాతి లవకేశవరావు, వంశీ, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



నగరం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణకుమారి

మామిడికుదురు: నగరం గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా ముందుకు వెళదామంటూ సర్పంచ్ జాలెం రమణకుమారి కోరారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నగరం గ్రామ సర్పంచ్ రమణకుమారి అధ్యక్షతన జరిగింది. చమురు సంస్థలకు చెందిన సోలార్ ప్లాంట్ నుంచి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారికి వచ్చే లింకు రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు కోరారు. ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

అంబాజీపేట: సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని ముక్కామల వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు. ఇరుసుమండలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యాధికారిణి ఇంద్రావతి మాట్లాడుతూ జలుబు, జ్వరం, దగ్గు, విరేచనాలు ఎక్కువగా ఉంటే వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించాలన్నారు. డయేరియా, డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు



స్వాతి నక్షత్రం పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని సోమవారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకం అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. కలశాల్లోని జలాల్లోకి శ్రీస్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామికి విశేష అభిషేకం చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.